విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 30 ఆగస్టు 2025 8 పేజీలు

కార్మికులకు యాక్సిస్ అకౌంట్లు ఆపండి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు మధు

విశాలాంధ్ర-రాజమండ్రి : రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ కార్మికులు, పర్మనెంట్ ఉద్యోగ కార్మికుల ఖాతాలు ప్రభుత్వ బ్యాంకులైన ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ తదితర వాటిల్లో వేతనాలను ఇప్పటివరకు గడిచిన అన్ని ప్రభుత్వాలు జీతభత్యాలు వేసే వారని, ఇప్పుడు నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం వీరందరి ఖాతాలను అంటే దాదాపు నాలుగు లక్షల ఖాతాలను ప్రైవేట్ కార్పొరేట్ బ్యాంక్ అయిన యాక్సిస్ బ్యాంకు ద్వారా చెల్లిస్తామని సర్క్యులర్ జారీ చేయడం వెనుక ప్రభుత్వ బ్యాంకులపై ఉన్న ద్వేషం యాక్సిస్ బ్యాంకు పై ఉన్న ప్రేమ ఏంటో చెప్పాలని కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని ఈ అకౌంట్ ప్రక్రియ ఆపాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు కోరారు. శుక్రవారం స్థానిక 18 వ సర్కిల్‌లో యూనియన్ సమావేశం రెడ్డి రమణ అధ్యక్షతన జరిగింది. అనంతర ఎంహెచ్‌ఓకు వినతి పత్రం అందజేశారు ఈ సంద ర్భంగా మధు మాట్లాడుతూ అసలు ఎందుకు యాక్సిస్ బ్యాంక్ అకౌంట్ తీస్తున్నారో చెప్పాలని, ఈ ప్రభుత్వం జవాబుదారితనంగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు సంబంధించి సహజమరణాలకు ప్రమాదం బారినపడి మరణించిన ఉద్యోగ కార్మికు లకు కార్మిక సంఘాలుగా పోరాడి జీవో నెంబర్ 26 తెచ్చుకొని ఎక్స్‌గ్రేషియాలను సాధించుకుంటే వాటికి తూట్లు పొడిచేలా యాక్సిస్ బ్యాంకులో అధికమైన ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారని భారీ ఇన్సూరెన్స్‌లు ఉన్నాయని ప్రభుత్వమే ఉద్యోగ కార్మికుల ఖాతాలను మళ్లించడం చూస్తుంటే ఈ ప్రభుత్వ పెద్దల షేర్లు ఏమైనా యాక్సిస్ బ్యాంకులో ఉన్నాయా లేక ప్రభుత్వం తన ఉద్యోగ కార్మికుల బాధ్యతలను తగ్గించుకునే ప్రయత్నం ▶మిగతా 2లో..

గోదా "వర్రీ"

- భయం గుప్పెట్లో వేల కుటుంబాలు
- పంట లేదు... కూలీలకు పని లేదు
- వరద రోజుల్లో బాధితులది వర్ణించలేని వ్యధ
- శాశ్వత పరిష్కారం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూపులు

విశాలాంధ్ర - వేలేరుపాడు : గోదావరి ప్రతి ఏడాది వర్షాకాలంలో విలీన మండలాల్లోని వేల కుటుంబాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. విలీన మండలాల్లోని ముంపు గ్రామాల్లోని ప్రజలు వర్షాకాలం అంతట బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత రెండు రోజులుగా క్రమంగా పెరుగుతున్న గోదావరి వలన ముంపు ప్రాంతాల్లో ఆందోళన మొదలైంది. గడిచిన కొద్ది రోజుల క్రితం వరద వచ్చి తగ్గటంతో ముంపు తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ రెండు రోజుల నుండి అంతకంతకు పెరుగుతూ వల్లపు ప్రాంతాలను ముంచుకొస్తున్న వరద స్థానికుల్లో భయాన్ని కలగజేస్తున్నది. ముంపు గ్రామాల ప్రజలతో గోదావరి దోబూచులాడుతోంది. వరద పెరగడం వలన ఎద్దువాగు పోటెత్తింది. దీంతో కోయిదా, కాచారం, సిద్ధారం, టేకూరు, టేకుపల్లి, భూరెడ్డిగూడెం, కట్కూరు, ఎడవల్లి, ఎర్రతొగు, చిట్టెంరెడ్డిపాలెం, ఎడవల్లి తదితర సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో వారి అవసరాలకు పడవను వినియోగిస్తున్నారు.

సమస్యగా మారిన సామాగ్రి తరలింపు : కాయకష్టంతో కూడబెట్టుకున్న ఇంటి సామాగ్రి వరదలకు మెరక ప్రాంతాలకు తరలించడం తిరిగి తీసుకురావడం స్థానికులకు పెద్ద సమస్యగా మారింది. ప్రతి ఇంట్లో నిత్యవసరంగా మారిన అనేక ఎలక్ట్రికల్ వస్తువులు, ఇతర వస్తువులు వాహనాలపై తిప్పటం వలన పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వ్యాపారస్తులకైతే ప్రతి ఏడాది గోదావరి వరద వలన భారీ నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. మెరక ప్రాంతాల్లో సరైన వసతులు లేక ఇబ్బందులు తప్పటం లేదు.

42 అడుగులకు చేరిన గోదావరి : భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రానికి వరద 40 అడుగులు ▶మిగతా 2లో..

రీ సర్వే, స్వామిత్వ పనుల్లో ఖచ్చితత్వం పాటించాలి

కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - కోరుకొండ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అంతా రీ సర్వే, స్వామిత్వ పనులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వామిత్వ, రీ సర్వే పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, రీ సర్వే పనులు ఖచ్చితత్వం కలిసి చేపడుతున్నా ఇంకా సమస్యలు ఉత్పన్న మవుతున్నాయన్నారు. వ్యవస్థను స్థిరీకరించడానికి డిప్యూటీ ఎంపీడీవో (ఈవో పీఆర్డీ) నోడల్ అధికారి గానే కాకుండా అందరు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పర్యవేక్షణాధికారులు తమ బాధ్యతలను ఖచ్చితంగా నిర్వర్తించాలని, కేవలం ఆదేశాలు ఇచ్చానని చెప్పడం సరిపోదన్నారు. ప్రజలకు పౌర సేవలు అందించే క్రమంలో నిర్లిప్తత వహిస్తే ఊరుకోనని ▶మిగతా 2లో..

ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

విశాలాంధ్ర - కాకినాడ : ప్రతి మహిళ వ్యాపారవేత్తగా, పారిశ్రామిక వేత్తగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, రక్షణలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు. శుక్రవారం కాకినాడ జిల్లాలో పర్యటించిన ఆమె స్థానిక స్మార్ట్ సిటీ సమావేశ హాలులో ఐసిడిఎస్ విభాగం మహిళల సంక్షేమం, భద్రత, హక్కులు అంశాలపై నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, మహిళా కమిషన్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణ కేవలం ప్రభుత్వం, పోలీసులు ఒక్కరిదే కాదని సమాజంలో ప్రతి ఒక్కరూ ఈ బాధ్యత స్వీకరించేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం ఎన్ని వనరులు కల్పించినా, పోలీస్ విభాగం ద్వారా శక్తి యాప్, శక్తి టీమ్స్, మహిళా పోలీస్ స్టేషన్ వంటి ఎన్ని వ్యవస్థలు ఏర్పాటు చేసినా, మహిళలపై అక్కడక్కడా లైంగిక వేధింపులు, దాడులు ఇంకా జరుగుతునే ఉన్నాయన్నారు. ఇటీవల వెలువడిన జాతీయ స్థాయి సర్వేలో వైజాగ్ ▶మిగతా 2లో..

'108' సమర్థవంతంగా సేవలందించాలి

కలెక్టరు కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా కలెక్టరేటు జిల్లా కలెక్టరు ఛాంబర్లో శుక్రవారం మెడికల్ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులకు వసతిగృహాల్లో సౌకర్యాలు, 104 వాహనాలు, తదితర అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, డిసిహెచ్‌యస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు జరిగేలా వైద్యులు చూడాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతతో పనిచేసి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. సిసి కెమెరాల ద్వారా వైద్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కాలేజీ టెక్నీషియన్లు, టెక్నికల్ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన 108 వాహనాలను ఆక్షన్ వేసి, ▶మిగతా 2లో..

మాదకద్రవ్యాల నియంత్రణకు సమిష్టి కృషి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: మాదకద్రవ్యాల నియంత్రణకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా ఎన్ కార్డ్ (జిల్లా స్థాయి కమిటీ ఫర్ బెటర్ కోఆర్డినేషన్ ఇన్ కంట్రోలింగ్ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ) పై సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో గంజాయి సాగు నియంత్రణ, రవాణా, అమ్మకం, వినియోగం, అవగాహన, గంజాయికి బానిసలైన వారికి వైద్య సహాయం, పునరావాసం అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంపై అనర్థాలను ప్రజలకు తెలియచెప్పేందుకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. వీటిని సేవించడం వలన ▶మిగతా 2లో..

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర -భీమవరం: చదువుకునే వయస్సులో చదువు మీద మాత్రమే ఏకాగ్రత కలిగి వుండాలని, ఇతర ఆకర్షణలకు లోనైతే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేరని భీమవరం 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ ఎన్.జ్యోతి అన్నారు. శుక్రవారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో బాల్య వివాహాల పర్యవసానాల పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసల కోర్చి తల్లిదండ్రులు చదివిస్తున్నారని, బాల్య వివాహాలు చేసుకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. సిఐ కాళీ చరణ్ విద్యార్థినులకు శక్తియాప్ పై వివరించి మాట్లాడుతూ బాలికలు ఏదైనా ప్రమాదంలో ఉంటే సెల్ ఫోన్ ను మూడు సార్లు చేతితో అడ్డంగా ఊపితే సంబంధిత పోలీసులకు సమాచారం వెళ్తుందని వివరిం చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, టూ టౌన్ సిఐ జి.కాళీచరణ్, ప్యానెల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, పి.అంబేద్కర్, మీడియేషన్ న్యాయవాది కె.విజయలక్ష్మి, ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మి కాంతమ్మ, డాక్టర్ చాందిని, హాస్టల్ వార్డెన్ డి.శ్రీనివాస్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, వైస్ ప్రిన్సిపాల్ టి.తిరుపతిరెడ్డి, కాలేజ్ ఎఒ భీమారావు, పారా లీగల్ వలంటీర్లు కె.చంద్రరావు, చాన్‌బాషా, ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో రోడ్లు అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ప్రధానంగా జంగారెడ్డిగూడెం మండలం లక్ష్మీపురం నుంచి టి నరసాపురం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా పాడైపోయింది. రోడ్డు పొడవునా గోతులు ఏర్పడడంతో వాహనదారులు రోడ్డుపై వాహనాలు నడపడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల మూడు నెలల క్రితం కొంతమేర రోడ్డు మరమ్మతులు చేసినప్పటికీ, రిపేర్ చేసిన రోడ్డు కూడా నాణ్యత లోపంతో మళ్ళీ గోతులు ఏర్పడి వాహనాలు పడిపోయే పరిస్థితి నెలకొంది.వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అప్పటివరకు కనీసం గుంతలైనా పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

గోదా"వర్రి" (1వ పేజీ తరువాయి)

చేరింది. 43 అడుగులకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. అక్కడి గోదావరి పెరుగుదల అంచనాతో స్థానికంగా ముంపు ప్రభావాన్ని లెక్క కడతారు. ప్రతి ఏడాది వరదల వలన తీవ్రంగా నష్టపోతున్నామని, వరదల కాలమంతా పనులు లేక ఇల్లు గడవని పరిస్థితి ఏర్పడుతుందని ప్రభుత్వం మేము పడుతున్న ఇబ్బందులను గమనించి పోలవరం ముంపు బాధితులమైన తమకు శాశ్వత పునరావాసం కల్పించాలని కోరుతున్నారు.

అకౌంట్లు ఆపండి (1వ పేజీ తరువాయి)

చేస్తుందా అని అనుమానం వ్యక్తం అవుతుందని అన్నారు. యాక్సిస్ బ్యాంక్ విధివిధానాలలో గతంలో ఆర్‌బిఐ కొన్ని రద్దు చేసిందని, యాక్సిస్ బ్యాంకులో ప్రస్తుతం జీరో అకౌంట్‌లో ఓపెనింగ్ చేసినా రానున్న కాలంలో మంత్లీ చార్జెస్ పేరుతోనూ వసూళ్లు చేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ బ్యాంకుల పరిరక్షణ కోసం ఉద్యోగ కార్మికుల భద్రత కోసం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కొత్త అకౌంట్ వల్ల ఈపీఎఫ్, ఈఎస్ఐ నెల వారి జీతాలకు ఇబ్బందులు పడతామని మధు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అల్లం వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉప అధ్యక్షులు డి.దుర్గమ్మ, జిల్లా నాయకులు కాకి శారద, పి.పోలమ్మ, ప్రసాద్, బంగారు గిరి, అల్లం బాలు, ముత్యాల మురళి తదితరులు పాల్గొన్నారు.

వైఎన్‌లో తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - నరసాపురం: తెలుగు భాషను అభివృద్ధి చేసుకొని, సంరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని విశ్రాంత తెలుగు అధ్యాపకులు ధవళ లక్ష్మీనరసింహారావు అన్నారు. శ్రీ వైఎన్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కనకరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలోతెలుగు వెలుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. 'మన మాతృభాష తెలుగు ప్రస్తుతం అంతరించే స్థాయికి దగ్గరలో ఉందని యునెస్కో ప్రకటించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అధిగమించి మన భాషను అభివృద్ధి చేసుకొని, సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అకాడమిక్ సలహాదారుడు ఆర్‌వి సుబ్బారావు మాట్లాడుతూ, గిడుగు రామమూర్తి పంతులు కృషి ఫలితంగా ఈరోజు మనం వ్యవహారిక భాషా ఫలాలను అనుభవిస్తున్నామన్నారు. హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మను, అమ్మ భాషను మరిచిపోరాదని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డీన్ గంధం శ్రీ రామకృష్ణ, తెలుగు శాఖా విభాగాధిపతి సాదే యాకోబు, సంస్కృత శాఖా విభాగాధిపతిరాలు డాక్టర్ కె.వి.ఆర్.బి. వరలక్ష్మి, జాగ్రఫీ శాఖ విభాగాధిపతి కె సి ఎస్ వి రమణ, భీమడోలు ప్రసాద్, బీఈడీ వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎదగాలి (1వ పేజీ తరువాయి)

నగరం దేశంలో బాలికలకు అత్యంత భద్రమైన నగరాల్లో ఒకటి గాపేర్కొనడం మనందరం ఆనందించే అంశమన్నారు. కేవలం వైజాగ్ నగరమే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి ఊరిని ఆడ పిల్లలకు భద్రమైనదిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా మహిళా కమిషన్ పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల ఎక్కువ మంది మహిళలు బయటకు వచ్చి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారని, తద్వారా మహిళా సాధికారత మరింత పెరిగి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మహిళలు కీలక భూమిక వహిస్తారన్నారు.

ఖచ్చితత్వం పాటించాలి

(1వ పేజీ తరువాయి)

కలెక్టర్ తెలియ చేశారు. కోరుకొండ మండల పరిధిలో ఫేజ్ వారీగా తొలి దశలో రీసర్వే పూర్తి చేశామని, రెండు గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్ పనులు 100% పూర్తి చేశామని నివేదిక ఇచ్చినప్పటికీ, అన్ని గ్రామాలు పూర్తయ్యాయని చూపడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పి. వీణాదేవి, డిప్యూటీ ఎంపీడీవో బి. మహేష్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషి (1వ పేజీ తరువాయి)

కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని, తీవ్ర అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి వంటి మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే ఎక్కడ నుండి రవాణా అవుతున్నాయో వాటి మూలాలను గుర్తించేం దుకు తగు చర్యలను తీసుకోవాల న్నారు. పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు.

జిల్లాలో పోలీస్, ఎక్సైజ్ శాఖలు మాదకద్రవ్యాల వినియోగంపై పక్కాగా తనిఖీలు చేసి నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ 2025 జనవరి నుండి నేటి వరకు ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద 8 కేసులు నమోదయ్యాయని, 33 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. 25.286 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. మాదకద్రవ్యాలు వినియోగిస్తే కలిగే అనర్థాలపై 86 పాఠశాల సమీపంలో, 225 కళాశాల సమీపంలో గోడ పత్రికలను అంటించినట్టు పేర్కొన్నారు. జిల్లాలోని 71 ప్రముఖ కూడళ్లల్లో కూడా హోర్డింగ్స్ ఏర్పాటు చేశామన్నారు. 295 కాలేజీలు వద్ద, 589 బహిరంగ ప్రదేశాల్లో, 56 గ్రామాల్లో అవగాహన కొరకు సమావేశాలను కూడా నిర్వహించినట్టు వివరించారు.

సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ వి. భీమారావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి ప్రసాద్ రెడ్డి, ఇన్‌చార్జి జిల్లా రవాణా అధికారి డి ఎస్ ఎన్ నాయక్, ఆర్డీవోలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో, డీఎస్పీలు జై సూర్య, శ్రీ వేద, డి.విశ్వనాథ్, డిఎంహెచ్వో డాక్టర్ జి.గీతాబాయి, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారా యణ, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వివిఎస్‌బి రామాంజ నేయరాజు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె. వెంకటేశ్వర రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పుష్పరాణి, పిడి డిఆర్‌డిఎ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఈఓ కార్యాలయం ఏడి సత్యనారాయణ, ఈగల్ టాస్క్ ఫోర్స్ ఎస్సై, తదితరులు పాల్గొన్నారు.

సేవలందించాలి (1వ పేజీ తరువాయి)

కొత్త వాహనాలకు ప్రపోజల్స్ సిద్ధం చెయ్యాలని సంబంధిత అధికారులను కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లా మెడికల్ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులకు వసతి, విద్యాబోధన పట్ల సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మెడికల్ విద్యార్థుల వసతికి ఎటువంటి ఇబ్బందులు లేవని, సెప్టెంబరు 5వ తేదీ నాటికి మూడవ బ్యాచ్ 150 మంది విద్యార్థులు వస్తారని వీరికి వేరే చోట అన్ని సౌకర్యాలు ఉన్న వసతి గృహ భవనాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ లోపుగా మాతాశిశు భవనం రెండవ ఫ్లోర్లో తాత్కాలికంగా వసతి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఇదే హాస్పటల్లో ప్రస్తుతం ఉన్న డిసిహెచ్ యస్ కార్యాలయాన్ని వేరే చోట భవనానికి షిఫ్టు చేసి, ఖాళీ చేసిన భవనాన్ని హాస్పిటల్‌కు అప్పజెప్పాలని అన్నారు. నర్సింగు కాలేజీ, నర్సింగు స్కూలు,వసతి గృహాలు ప్రస్తుతం జనరల్ హాస్పిటల్ ఒక ఫ్లోర్‌లో కార్యకలాపాలు జరుగుతున్నాయని, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలోకి వీరిని షిఫ్టు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ ఒక మాసంలో పూర్తి చేయాలని ఏపీయంయస్ ఐడిసి అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జె. అమృతం, డిసిహెచ్‌యస్ డాక్టర్ బి.పాల్ రాజు, సూపరింటెం డెంటు యం.యస్. రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాస్కర్, 108 మేనేజరు డి.రాజు, ఏపియంయస్ ఐడిసి ఇంజనీరు యు.యస్.వై. రాజబాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

విశాలాంధ్ర -లింగపాలెం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సింగగూడెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో తదితర క్రీడా పోటీలు పెట్టారు. వ్యాయామ ఉపాధ్యాయులు కామేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ క్రీడాకారుడు, ఒలింపిక్స్ లో స్వర్ణ పతకాలు సాధించిన ధ్యాన్‌చంద్ క్రీడ ప్రతిభను గుర్తు చేసుకుని ఆయనకు నివాళులు అర్పించారు. ప్రతి విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని లింగపాలెం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ

విశాలాంధ్ర - నరసాపురం : భవన నిర్మాణ కార్మికులు తమ నైపుణ్యాలను మరింత మెరుగు పరుచు కోవడం ద్వారా మంచి ఉపాధి అవకాశాలు అందిపుచ్చు కోవచ్చునని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వసంతరావు అన్నారు. నరసాపురం మండలం పెదమైనవానిలంక డిజిటల్ కమ్యూనిటీ భవనంలో అల్ట్రాటెక్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంయుక్తంగా భవన నిర్మాణ కార్మికులకు శుక్రవారం ఉషా (అల్ట్రాటెక్ స్కిల్ హోనింగ్ అకాడమీ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా వాటర్ ప్రూఫింగ్, టైల్ అప్లికేషన్ విధానాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో న్యాక్ డైరెక్టర్ ఎం.ఇంద్ర కిరణ్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అల్ట్రా టెక్ సిమెంట్ సేల్స్ మేనేజర్ ఎంవీ సుబ్బారావు, టెక్నికల్ మేనేజర్ జి. క్రాంతి కుమార్, బిల్డింగ్ ప్రొడక్షన్ డివిజన్ సేల్స్ మేనేజర్ టి.శ్రీధర్, టెక్నికల్ మేనేజర్ కె. సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా రక్తదానం

విశాలాంధ్ర -భీమవరం: రక్తదానం నిండు ప్రాణాన్ని రక్షిస్తుందని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సి.హెచ్. అప్పారావు అన్నారు. జిల్లా నీటి నిర్వహణ సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో భీమవరం, తణుకు రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్లలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలో ప్రాణాలను రక్షించడానికి రక్తదానం ఎంతో ముఖ్యమన్నారు. ఉద్యోగులు కేవలం విధులకు పరిమితం కాకుండా, సామాజిక మానవతా కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నందుకు డ్వామా సిబ్బందిని ఆయన అభినందించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.వి.ఎస్. భద్రిరాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాల భాగ స్వామ్యంతో రక్తదాన శిబిరాలను ప్రారంభించడం ప్రజల్లో రక్తదానంపై అవగాహన కల్పించడానికి, ప్రోత్సహించడానికి చేపట్టిన కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.ఎస్. వర్మ, డ్వామా ప్రతినిధి శ్రీనివాస్, రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామవరం పంచాయతీలో ఎరువుల పంపిణీ

విశాలాంధ్ర - వేలేరుపాడు : రామవరం పంచాయతీలోని రైతులకు సర్పంచ్ పిట్ట ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం ఎరువులు పంపిణీ చేశారు. ప్రతి ఎకరానికి యూరియా, డీఏపీ ఒక్కొక్క బస్తా లెక్కన 340 బస్తాలను భూమి పట్టాలు ఉన్న వివిధ గ్రామాల రైతులకు ఇచ్చారు.

పూర్తిస్థాయిలో ఎరువులు అందించాలి :సీపీఐ

అరకొర ఎరువులు ఇస్తూ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. రామవరం పంచాయతీలో ఎరువుల పంపిణీని నాయకులు పర్యవేక్షించారు. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ఎరువులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదువేల ఎకరాల పంట సాగు చేస్తున్న రామ వరం పంచాయతీలో 340 బస్తాల ఎరువు ఏ విధంగా సరిపోతుం దని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేవలం పట్టాదారులకే ఎరువులు ఇవ్వటం వలన పోడు వ్యవసాయం చేసే గిరిజనులకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయం వలన చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం చేయటానికి ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు పండించే పంటలకు ఎంత అవసరం ఉంటుందో అదే స్థాయిలో ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మడివి కామయ్య, బంధం నాగేశ్వరరావు, పిట్ట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి ఉద్యోగి తాను పనిచేసే చోట కష్టపడి పని చేస్తే వారికి మంచి గుర్తింపు వస్తుందని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ పల్లికొండ కిరణ్మయి, డాక్టర్ కమతం ఓంకార్ నాథ్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గణపవరంలో కొన్ని సంవత్సరములు పనిచేసి ఇటీవల సాధారణ బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లిన ఉద్యోగులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్టాఫ్ నర్స్ డి. శిరోమణి, ఏఎన్ఎంలు కె.పుష్పావతి, జి.కనకలక్ష్మి, ఎస్.సముద్ర వేణి, బి.సుజాత, ఇ. వరలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. ఆశ కార్యకర్త సిహెచ్ సుబ్బలక్ష్మి వాలంటరీ ఇవ్వగా వారిని కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జాలాది విల్సన్ బాబు, బాలమురళీకృష్ణ, ఎమ్మెస్ యోహాన్, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం ఏర్పాటుపై 31న అఖిలపక్షం

విశాలాంధ్ర - నరసాపురం : నరసాపురాన్ని జిల్లా కేంద్రం చెయ్యాలని కోరుతూ ప్రభుత్వానికి వివరణ తెలిపేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో, నరసాపురం అఖిల పక్ష జేఏసి నేత, సీపీఐ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు అధ్యక్షతన ఈ నెల 31వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు జేఏసీ కన్వీనర్ నెక్కంటి సుబ్బారావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాల మార్పుల పునః పరిశీలనలో భాగంగా భౌగోళిక అర్హతలు ఉన్న నరసాపురాన్ని జిల్లా కేంద్రం చెయ్యాలని ప్రభుత్వం, జిల్లా కేంద్రాల పరిశీలన కమిటీ దృష్టిలో పెట్టేందుకు భవిష్యత్ కార్యాచరణపై అఖిలపక్ష సమావేశం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమానికి అన్ని పార్టీల ముఖ్య నాయకులు, ప్రజా సంఘాలు, వ్యాపార సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, భవన నిర్మాణ కార్మికుల సంఘం, వివిధ సంఘాల ప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

యువత భాష, క్రీడా నైపుణ్యాలు పెంచుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: అవకాశాలు అందిపుచ్చుకునే తరుణంలో వెనుకబడకుండా ఉండాలంటే మాతృభాష, క్రీడా నైపుణ్యాలు అభివృద్ధి పరుచుకొని మానసిక, శారీరక సామర్థ్యాలను సాధించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి మల్లుల సీతారాం ప్రసాద్, కళారంజని అధ్యక్షులు జవ్వాది దాశరథి శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. స్థానిక ఆర్.ఆర్.డి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ భాషా సాహిత్యాల ద్వారా సామాజిక చైతన్యానికి పాటుపడుతూ మరోవైపు క్రీడలలో ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా శారీరక దారుఢ్యాన్ని సాధించి యువత మేథోపరమైన శక్తివంతమైన సమాజాన్ని నిర్మించాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అరవింద స్వామి మాట్లాడుతూ గ్రాంథిక భాషకు చరమ గీతాన్ని పాడి, సామాన్య ప్రజలు మాట్లాడుకునే వ్యావహారిక భాషకు పట్టం కట్టిన గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయుడని పేర్కొన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు మాట్లాడుతూ భాష ప్రజల శ్వాస లాంటిదని తెలుగు భాషా సామర్థ్యాలు నేర్చిన విద్యార్థి ప్రపంచంలోనే ఏ ఇతర భాషనైనా అవలీలగా నేర్వగలడని సూచించారు. తొలుత గిడుగు వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అధ్యాపకులు ఎస్.లక్ష్మీకాంతం, జి.ఉమామహేశ్వరి, ఎల్.నరసింహా రావు, డి.వి.వి.సి.హెచ్. సత్యనారాయణ, జి.ప్రసాద్‌బాబు తదితరులు మాట్లాడారు. కార్యక్ర మంలో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన డి.అశ్విని, వి.దుర్గా మహాలక్ష్మి, కె.గౌతమి, జి.రాజరాజేశ్వరి దేవి, జె.అన్నవరం, డి. వెంకటలక్ష్మి తదితరులకు బహుమతులు ప్రదానం చేశారు.

భావవ్యక్తీకరణకు మాతృభాష దోహదం

విశాలాంధ్ర-పెదపాడు: పెదపాడులోని కాకరాల చంద్రశేఖరరావు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మనసులో భావాలను వ్యక్తపరచడానికి మాతృభాష ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఎన్నో త్యాగాలతో సాధించిన తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అన్ని స్థాయిల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత తెలుగుభాష గొప్పతనాన్ని పరిరక్షించేందుకు కృషిచేసిన గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు కవితలు, పద్యాలు, గేయాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు ఎస్.మధుసూదనరావు, షేక్ బాపూజీ, జి. చంద్రశేఖరరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మనైన తెలుగు భాషను మరువవద్దు

విశాలాంధ్ర-లింగపాలెం: తెలుగు భాషను కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగు పండితులు, కవి, రచయిత, ఉపాధ్యాయులు లక్కపాం ప్రకాశరావు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా సింగగూడెం ఉన్నత పాఠశాలలో ధర్మాజీగూడెం శ్రీవిద్య పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాషా పండితులు ప్రకాశరావు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనం సాటిలేనిదని అన్నారు. ఏ భాషను నేర్చుకున్నా మాతృభాష తెలుగును మరువవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వ్యాసరచన, ప్రసంగాల పోటీలను నిర్వహించారు.శ్రీవిద్య పాఠశాలలో విద్యార్థులు తెలుగుమాత,తెలుగుకవి

గిడుగు వెంకట రామమూర్తి వేషధారణతో తెలుగు భాష గొప్పదనాన్ని గుర్తు చేశారు. పలు రకాల తెలుగు పద్యాలు, గీతాలతో నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమంలో సింగ గూడెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, శ్రీవిద్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నాకర్, కరస్పాండెంట్ సాయి సునంద తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని లింగపాలెం మండలంలోని అన్ని పాఠశాలలో నిర్వహించారు. పాఠశాలల్లో తెలుగు భాష గొప్పదనాన్ని తెలుగు మాస్టార్లు విద్యార్థులకు వివరించారు.

తెలుగు భాషను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : తెలుగు భాష సంస్కృతిని కాపాడి భవిష్యత్తు తరాల కోసం కృషి చేయాలని అరసం రాష్ట్ర కార్యదర్శి బి ఎన్ సాగర్ సూచించారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమాన్ని ములుగులంపల్లిలో అరసం ఏలూరు జిల్లా శాఖ,

పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ నేపథ్యంలో వివిధ భాషల సంస్కృతులు కొట్టుకుపోతున్నాయని అన్నారు. ప్రస్తుతం తెలుగు మాట్లాడితే వాడు అనాగరికుడిగా ముద్ర వేయడం తగదని అన్నారు. తెలుగు భాషా సంస్కృతి పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రసిద్ధ హాకీ క్రీడాకారుడు ధ్యానచంద్ జీవిత విశేషాలను వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. ప్రసాద్, సిహెచ్ సత్యనారాయణ, ధర్ముల రాజు, తాటి ఎల్లప్ప, తాతా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెలుగు భాషా దినోత్సవాన్ని స్థానిక ప్రకాశం డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యాసంస్థల అధినేత వి. జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ కార్యదర్శి డాక్టర్ టి పి సారథి తెలుగు భాష ప్రాముఖ్యత, విశిష్టతను విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష గురించి నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు

బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుసుమ కుమారి, హనుమాన్ చౌదరి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్యాంప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎన్ఆర్‌లో తెలుగుభాషా దినోత్సవం

విశాలాంధ్ర -భీమవరం: అంతరించి పోతున్న తెలుగు భాషను సంరక్షించుకోవాలని డిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ అన్నారు. తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని కళాశాలలో తెలుగు, సంస్కృతం విభాగాల ఆధ్వర్యంలో గిడుగు

రామమూర్తి పంతులుకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పండితులకే సాధ్యమైన తెలుగును వ్యావహారిక భాషగా తీర్చిదిద్దిన ఘనత గిడుగు రామమూర్తికే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ఏ.ఐ పి.రామకృష్ణంరాజు, లైబ్రేరియన్ ఎం.వెంకట్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని కళాశాలలో

తెలుగు భాషా దినోత్సవం సెమినార్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాకలపాటి నిర్మలకుమారి అధ్యక్షత వహించి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గిడుగు వ్యావహారిక భాషోద్యమ నాయకుడని, వ్యావహారిక భాషలో చదువుకోవాలని, అమ్మ భాషని తక్కువ చేయకుండా ఎక్కువ చదువుకొని గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.స్వరూపరాణి, అధ్యాపక బృందం శ్రీ ఎన్ వి ఎన్ బి శ్రీనివాసరావు, డాక్టర్ సిహెచ్ అనురాధ, డాక్టర్ జి. వెంకటరావు, పి. భాస్కరరావు, మోహినన్నారి, డాక్టర్ షేక్ పర్వీన్, బి. రాణి దుర్గ, ఎస్. వెంకన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **INKULU VEERA VENKATA SRI GAYATHRI DEVI (New Name)**, W/o Pavan Srikanth Subbarao, Previously Called **NAMBURI VEERA VENKATA SRIGAYATRI (Old Name)**, Resident of D.No. 3-7-3/5, Nandibomma Centre, Tadepalligudem, Tadepalligudem Mandal, W.G.Dt.,Pin-534101, Andhra Pradesh. I have changed my name from **NAMBURI VEERA VENKATA SRI GAYATRI (Old Name)** To **INKULU VEERA VENKATA SRI GAYATHRI DEVI (New Name)** for all practical purposes.

ఆర్జీయూకేటీలో ఇంటర్నల్ హాకథాన్

విశాలాంధ్ర -నూజివీడు: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ) నూజివీడులో అమరావతి క్వాంటం వ్యాలీ హాకథాన్ 2025 సంవత్సరానికి సంబంధించి ఇంటర్నల్ హాకథాన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 30 టీమ్‌లు నమోదు చేసుకోగా 29 టీమ్‌లు తమ ఐడియాలను అధికారిక పోర్టల్‌లో సమర్పించాయి. అందులో 25 టీమ్‌లు శుక్రవారం జరిగిన హాకథాన్‌లో పాల్గొని తమ ప్రతిభను, సృజనాత్మకతను ప్రదర్శించాయి. ఈ కార్యక్రమా నికి ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బి. లక్ష్మణరావు హాజరయ్యారు.

కార్తీక్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు వాసి పిళ్ళా కార్తీక్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఐఐటి ముంబై విశ్వ విద్యాలయం నుండి డాక్టరేట్ అందుకున్నారు. ఎలక్ట్రో కెమికల్ సిస్టం, పరికరాలలో ఉపయోగించే పాలిమర్, సన్నని ఫిల్మ్‌ల ఇన్సిట్ మెకానికల్ స్పెక్ట్రోస్కోపిక్ స్టడీస్ అంశం పై కార్తీక్ విస్తృత పరిశోధన చేసి, సిద్ధాంత గ్రంథాన్ని విశ్వ విద్యాలయానికి సమర్పించి పిహెచ్‌డి పట్టా పొందారు. విశ్వ విద్యాలయం అధికారులు స్నాతకోత్సవంలో కార్తీక్‌కు డాక్టరేట్ పట్టా అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు బుజ్జమ్మ, వెంకట అప్పారావులు, స్నేహితులు అందించిన ప్రోత్సాహంతో పాటు, విశ్వవిద్యాలయం ఆచార్యుల మార్గదర్శకత్వం తాను డాక్టరేట్ సాధించడానికి మూలమని, తాను పరిశోధన రంగంలో మరింత కృషి చేసి, నూతన ఆవిష్కరణలు చేస్తానని తెలిపారు. కార్తీక్‌ను ఉంగు టూరు గ్రామ సర్పంచ్ బందారు సింధు మధుబాబు, గ్రామస్తులు అభినందించారు

ఆది కర్మయోగి అభియాన్ పై అవగాహన

విశాలాంధ్ర-టి నరసాపురం: టి నరసాపురం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆది కర్మ యోగి అభి యాన్ ప్రోసెస్ ల్యాబ్ ప్రోగ్రాం పై మండల స్థాయి అధికారులకు, సచివాలయ సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ నోడల్ ఆఫీసర్ ఎన్.కిరణ్ కుమార్, డిఎంటి సిహెచ్ ఎన్.పొన్నారి, మండల అభివృద్ధి అధికారి జి.నగరాజ కుమారి, డిప్యూటీ ఎంపిడీఓ బి.శ్రీనివాసులు,ఏఓ జి.మణి కుమారి, మెడికల్ సిబ్బంది,ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మ కోసం ఒక మొక్క

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి పచ్చటి మొక్కలను పెంచాలని ప్రకాశం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.జనార్ధన్‌రావు సూచించారు. కళాశాలలో భారత యువజన క్రీడల మంత్రిత్వ శాఖ, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో అమ్మ కోసం ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మేర యువ భారత్ అధికారి సాయి సింగ్ తివారి, కళాశాల ప్రధాన అధ్యాపకులు సిహెచ్ హనుమాన్ చౌదరి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ ప్రసాద్, శ్యామ్, వరలక్ష్మి, అధ్యాపకులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్ సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే రోషన్ కుమార్

విశాలాంధ్ర-చింతలపూడి: చింతలపూడి పట్టణంలోని లయన్స్‌క్లబ్‌లో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్‌కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా గృహ వినియోగ దారులు అతి తక్కువ విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఇంటి పై కప్పుపై కనీసం 10 చ.మీ/100 చ.అ స్థలంలో 1 కిలో వాట్స్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయడం ద్వారా తమ విద్యుత్ అవసరాలను స్వయంగా తీర్చుకోవచ్చునని అన్నారు. ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేసి ప్రజలకు లబ్ది కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా సౌరశక్తి వినియోగం పెరిగి విద్యుత్ బిల్లు తగ్గించే అవకాశాలు ఉంటాయన్నారు. సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థల ద్వారా అందరూ పర్యావరణ అనుకూలమైన శక్తిని ఉపయోగించి విద్యుత్ వృథాను తగ్గించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డిఈతో పాటు నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులు, మండల పట్టణ అధ్యక్షులు, డ్వాక్రా సంఘాలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలు పరిష్కరించాలి

కలెక్టరు చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని, జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నిర్ణీత గడువులోపుగా పరిష్కారం చూపాలని కలెక్టరు చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై సిఎంఓ 1100 కు అందిన ఫీడ్ బ్యాక్ నివేదిక అనుసరించి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ జిల్లా అధికారులతో మౌఖికంగాను, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో వెబ్ఎక్స్ ద్వారా శాఖల వారి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఓ 1100 కు అందిన సమాచారం మేరకు పిజిఆర్ఎస్ ఫిర్యాదుదారులు సమస్యల పరిష్కారంపై వారి స్పందన సంతృప్తికరంగా లేకపోవడం వల్ల రాష్ట్రస్థాయిలో జిల్లా ర్యాంకు దిగువ స్థాయిలో ఉండటం పట్ల కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతివారం పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదుల పరిష్కారం పై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నా పురోగతి సాధించలేకపోవడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, గ్రామ వార్డ సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డిపిఓ ఎన్.రామ్నాథ్ రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి వెంకయ్య కుటుంబం సేవలు మరువలేనివి

విశాలాంధ్ర -చాట్రాయి : పర్వతాపురం సర్పంచ్ మిద్దె శివాజీ తల్లి మాజీ సర్పంచ్ మిద్దె కోటేశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో పలువురు వారి కుటుంబ రాజకీయ నేపథ్యాన్ని నెమరు వేసుకుంటున్నారు. బలహీన వర్గాలకు నిలయమైన చాట్రాయి మండలం పూర్వం రోజులలో కీర్తి శేషులు గద్దం సత్యనారాయణ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి కంచు కోటగా ఉండేది. దానిలో ముఖ్యంగా మూడు గ్రామాలు పర్వతాపురం, బూరుగ గూడెం, పోతనపల్లి పర్వతాపురం గ్రామానికి చెందిన మిద్దె తిరుపతి వెంకయ్య ఆయనకు మంచి అనుచరుడు. సుమారు 1970లో వెంకయ్య గ్రామపంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆనాటి నుండి ఈనాటి వరకు మధ్యలో కేవలం ముగ్గురు వేరే వారు సర్పంచ్ బాధ్యతలు నిర్వహించగా ఆనాటి తాతయ్య వెంకయ్యనుండి ఈనాటి మనవడు శివాజీ వరకు గ్రామంలో క్రియాశీలకమైన పాత్ర పోషించారని పలువురు కొనియాడుతున్నారు. వెంకయ్య పెద్దకొడుకు (పెద్దబ్బాయి) సత్యనారాయణ మృతురాలు కోటేశ్వరమ్మ రెండో కొడుకు బాలకృష్ణ. ప్రస్తుతం మనవడు శివాజీ వరుసగా పరిపాలన బాధ్యతలో ఉన్నారు. మిద్దె సత్యనారాయణ రెండు దఫాలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. మిద్దె బాలకృష్ణ వైసీపీ మండల అధ్యక్షునిగా పనిచేశారు. మండలంలో కూడా వీరి పాత్ర మరువలేనిదని మాజీ శాసనసభ్యులు ప్రతాప్ అప్పారావు కొని యాడారు. శివాజీ కుటుంబానికి నిరంతరం అండదండగా ఉంటామన్నారు. ఏపీ కోఆపరేటివ్ యూనియన్ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో తిరుపతి వెంకయ్య కుటుంబంతో ఉన్న సన్నిహిత్యాన్ని 60 ఏళ్ల చరిత్రను గుర్తు చేసుకున్నారు. వారి ప్రజా జీవితం మరువలేనిదని కొనియాడారు. మండల వైసీపీ అధ్యక్షులు పుచ్చకాయల సుబ్బా రెడ్డి తదితరులు శివాజీ కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.

దస్తావేజు పోయినది

మేడూరి వీరవెంకటసత్యనారాయణ S/o. శేషవతారం, కొమరాడ(గ్రా), భీమవరం (మం), పశ్చిమగోదావరిజిల్లా , భీమవరం పట్టణంలో నాభార్య పేరునున్న నివాస స్థలాన్ని నేను నాభార్య ఇద్దరం కలిసి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం (మండలం),ముమ్మిడివరం గ్రామ కాపురస్తులు నలమాటి చిట్టిబాబు గారి కుమారుడు సాయి నాగేంద్రవికాష్ వీరి భార్య ధరణి ప్రియ దంపతులకు విక్రయించి భీమవరం సబ్‌రిజిష్టార్ వారి కార్యాలయములో ది.13.12.2024వ తేదిన సదరు దస్తావేజు నెం.18622/2024 రిజిష్టర్డు చేసిఉన్నాము. సదరు విక్రయానికి సంబంధించి పదిలక్షలు బాకీ ఉన్నందున సదరు దస్తావేజును పై వారు నా వద్దే ఉంచినారు. ది.18.08.2025వ తేదిన కొమరాడ గ్రామం నుండి సదరు దస్తావేజు తీసుకుని భీమవరం వస్తుండగా దస్తావేజు కవరు నుండి జారిపడిపోయినది.

ఎంత వెదికినను దొరకలేదు. కావున ఎవరికైననూ దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామకు అందజేయగలరు.

సెల్ : 917288009425

ధ్యాన్‌చంద్ భారత మాత ముద్దు బిడ్డ

విశాలాంధ్ర -భీమవరం: సుప్రసిద్ధ భారతీయ హాకీ ఆటగాడు మేజర్ ధ్యాన్‌చంద్ 120 వ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం డిఎన్ఆర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. శ్రీ విజ్ఞాన వేదిక, డిఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్, మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా దినోత్సవంలో సెంట్రల్ లండన్ రాయల్ బరో ఆఫ్ కిన్సింగ్టన్ అండ్ చెల్సియా డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్ ఆరేటి ముఖ్య అతిథిగా పాల్గొని ధ్యాన్ చంద్ కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉదయ్, పిడి భూపతి రాజు వెంకట నరసింహరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకరిగా ధ్యాన్ చంద్ నిలిచారన్నారు. భారతదేశా నికి హాకీలో స్వర్ణయుగంగా పరిగణించబడిన 1928, 1932, 1936 ఒలింపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టారన్నారు. ఒకసారి తను గోల్ వేసిన తరువాత అది పడకపోతే తను గోల్ వేసిన విధానం చూసి గోల్ పోస్ట్ కొలతలు సరిచూడవలసిందిగా అంపైర్‌ను కోరగా అది సరియైన గోల్ గా గుర్తించబడి, నిర్ణయింపబడి అందరి మన్ననలు పొందారన్నారు. తద్వారా ఆయనకు ఆటమీద ఉన్న పట్టు, ప్రమాణాలను తెలియచేసిందన్నారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో డిఎన్ఆర్ కళాశాల అసోసియేషన్ కోశాధికారి కొత్త శ్రీనివాస్, పియిటిలు గొట్టుముక్కల చంద్రశేఖర్ రాజు, రామ్ భద్రిరాజు, భట్టిప్రోలు శ్రీనివాస్, బొండా రాంబాబు, పాకలపాటి సీతారామరాజు, నందమూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో తూడు, కిక్కిస తొలగించాలి

విశాలాంధ్ర - కలిదిండి: దమ్మిడి మురుగు కాలువలో పేరుకు పోయిన తూడు, గుర్రపు డెక్క, కిక్కిస పూర్తిస్థాయిలో తొలగించి మురుగునీరు ప్రవాహానికి అడ్డంకి లేకుండా చూడాలని అధికారులకు ఆంధ్రప్రదేశ్ గవర్న మెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసన సభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కలిదిండి మండలం కాళ్ళ పాలెం పంచాయతీ పరిధిలో ఆరుతెగలపాడు గ్రామం వద్ద దమ్మిడి కాలువకు మోక్షం కల్పించేందుకు ప్రొక్లైన్ కు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలలో గుర్రపు డెక్క కిక్కిస పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్నాయని, వాటిని తొలగించి కాలువల ప్రక్షాళన కు నీటి సంఘాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గత 50 ఏళ్లలో ఎప్పుడు చూడని విధంగా నీటి సంఘాలు కాలువలను బాగు చేయటం సంతోషంగా ఉందన్నారు. కోట్లు ఖర్చుపెట్టి కాలువలు బాగు చేస్తున్నారని మురుగు నీరు పారుదలకు ఆటంకం లేకుండా చూడాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఆంద్రాజు. శ్రీనివాసరావు, త్రినాధ రాజు, పూల రాజి, నీటి సంఘం నాయకులు, డ్రైనేజి అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్థానిక కల్పవృక్షం వృద్ధాశ్రమం ఎదుట జాతీయ ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున లారీ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. ఎదుట వెళుతున్న లారీని ఓవర్టేక్ చేస్తున్న సమయంలో అదుపుతప్పి రోడ్డు మార్జిన్ నుండి పల్టీ కొట్టిందని డ్రైవర్ పేర్కొన్నాడు. హైదరాబాదు నుండి తాడేపల్లి గూడెంకు మైదా లోడుతో వెళుతున్నట్టు తెలిపాడు.

మునికూడలి ఘాట్‌లో నిమజ్జనాలు

విశాలాంధ్ర - సీతానగరం: మునుకూడలి ఘాట్ లో మాత్రమే నిమజ్జనాలు చేయాలని తహసీల్దార్ ఏ శ్రీనివాస్ అన్నారు. సీతానగరం మండలం వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో 90 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతిగా ఉండడంతో వినాయక విగ్రహాలు నిమజ్జనాలు మునికూడలి గ్రామంలో గల దేవన్స్ ఘాట్ లో మాత్రమే నిమజ్జనాలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘాట్‌లో వినాయక నిమజ్జనాలకు తగిన ఏర్పాట్లు చేయడం జరిగింది అని అన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసిన ఘాట్లో మాత్రమే నిమజ్జనాలు చేయాలని కోరారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు. ప్రజల భద్రతే అధికారులు ముఖ్య ఉద్దేశ్యం అని పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో నిమజ్జనాలకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

డీఎస్సీలో మహిళల విజయం

విశాలాంధ్ర - సీతానగరం: పట్టుదలతో డి ఎస్ సీలో స్కూల్ అసిస్టెంట్ ఎంపిక. మండలంలోని సింగవరం గ్రామం దుర్గమ్మ తల్లి కాలనీలో శర్మ రవి ప్రకాష్, నాగమణిల ద్వితీయ కుమార్తె కుసుమా దేవి, కులం ఓసి డీఎస్సీ మొదటి ప్రయత్నంలోనే తూర్పు గోదావరి జిల్లాలో సోషల్ సబ్జెక్టులో 100కి 75.40587 మార్కులతో 60వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపిక అయ్యింది. అదే గ్రామానికి చెందిన చదరాశి జీవన జ్యోతి, సీతానగరం లంకూరు గ్రామానికి చెందినా తోలేటి గాయత్రి సెకండరీ గ్రేడ్ టీచర్లుగా ఎంపిక అయ్యారు. వీరి ఎంపిక పై మండల, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తూ అభినందనలు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-తాళ్లపూడి : తాళ్లపూడి మండల పోలీస్ స్టేషన్ పరిధి లోని తిరుగుడుమెట్టలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. తాళ్లపూడి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం టి.మెట్ట గ్రామానికి చెందిన సైదు సాయి (26) గ్రామ శివారు వేప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతునికి సుమారు ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య మృతి చెందడంతో మానసికంగా బాధ పడుతూ ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నట్లు తల్లి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లపూడి ఎస్.ఐ తెలిపారు.

నేడు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాక

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ శనివారం రాజమహేంద్రవరం పర్యటనలో పాల్గొననున్నారని జిల్లా మహిళా అండ్ శిశు సంక్షేమ అధికారి టి. శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.00 గంటలకు జె.ఎన్. రోడ్, IMA ఫంక్షన్ హాల్‌లో జరగనున్న జిల్లా స్థాయి అవగాహన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొనడం జరుగుతుందన్నారు. ఉదయం 11.25 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు మహిళా సాధికారత, భద్రత, హక్కులపై ముఖ్య ప్రసంగం చేస్తారు. మధ్యాహ్నం 12.00 గంటలకు మహిళా భద్రతపై ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి, 12.10 నుండి 12.30 వరకు పత్రిక విలేఖరులతో సమావేశం నిర్వహిస్తారు. 1.00 గంటలకు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో భేటీ అయ్యి, వ 3.30 గంటలకు స్థానిక మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 5.00 గంటలకు రాజ మహేంద్రవరం నుండి తిరుగు ప్రయాణం అవుతారు.ఈ కార్యక్రమానికి అధికారులు, న్యాయవాదులు, పోలీసులు, మహిళా సంఘాలు, సైబర్ క్రైమ్ విభాగం అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని శ్రీదేవి తెలిపారు.

స్వామిత్వ సర్వేపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర - నిడదవోలు : స్వామిత్వ సర్వే పనులు పూర్తి చేయడం, ఆయా రికార్డులు సిద్ధం చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ నిడదవోలు మండలంలోని విజ్జేశ్వరం సచివాలయ కార్యాలయాన్ని సందర్శించి స్వామిత్వ సర్వే పురోగతి, రికార్డుల అప్డేషన్ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ స్వామిత్వ సర్వే పనులు జరుగుతున్న సమయంలో అనుబంధ రికార్డులు సమాంతరంగా నవీకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సర్వే ప్రకారం పనులు పూర్తి చేసిన తర్వాత సంబంధిత రికార్డులు కూడా ఖచ్చితంగా సరిచూడాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి సూచించారు. రికార్డుల నిర్వహణలో జవాబుదారీతనం కలిగి ఉండాలని, డిప్యూటీ ఎంపీడీవో (ఈవోపీఆర్డీ), పంచాయతీ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలన్నారు.డిప్యూటీ ఎంపీడీవో (ఈవోపీఆర్డీ) నోడల్ అధికారి హోదాలో స్వామిత్వ సర్వే వ్యవస్థ సజావుగా సాగేలా చూడాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ శాఖల మధ్య సమన్వయం తప్పనిసరని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం బాధ్యతల నిర్వహణలో ఖచ్చితత్వం పాటించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. స్వామిత్వ డేటా ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా నిబద్ధతతో పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆన్లైన్‌లో నమోదు చేసిన అనేక రికార్డులను కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి ఏ. స్వీవా రెడ్డి, నిడదవోలు తహసీల్దార్ బి. నాగరాజు నాయక్, ఎంపీడీవో వివిఎస్ వి ఎల్ జగన్నాథం, సర్పంచ్ తిక్క శ్రీను, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు సంజీవని : ఎమ్మెల్యే

విశాలాంధ్ర కొవ్వూరు : సీఎం సహాయ నిధి చెక్కులు పేద మధ్యతరగతి వారికి సంజీవని వంటి పథకమని ఎమ్మెల్యే ముప్పుడి వెంకటేశ్వరవు అన్నారు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రెండు లక్షల 30 వేల చెక్కులను పట్టణ పరిధిలోని ఏడుగురు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టూ మెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి, కంటమని రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేనిచిన్ని, సూర్యదేవర రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్ కు 12 అర్జీలు..

పట్టణ తెలుగుదేశం పార్టీలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ కు, 12 దరఖాస్తుల అందినట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

వ్యాధుల ప్రబలకుండా జాగ్రత్తలు

విశాలాంధ్ర - కడియం : వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించడం సహజమని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారిన పడకుండా తప్పించుకోవచ్చని కడియం పిహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం మణిజ్యోత్స్న తెలిపారు. నీరు నిల్వ ఉండడం వలన, నిల్వ ఉన్న నీటిలో దోమలు ఎక్కువగా గుడ్లు పెట్టడం జరుగుతుందని, తద్వారా దోమలవ్యాప్తి పెరుగుతుందని తెలిపారు. దీనివలన మలేరియా, డెంగ్యూ, వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది జ్వరాల సర్వే చేస్తున్నారని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. బాలుర, బాలికల వసతి గృహాలలో ఎసిఎం స్ప్రేయింగ్, గ్రామంలో ఎబేట్ స్ప్రేయింగ్ చేయించినట్లు తెలిపారు. కడియం ఫిషరీష్ డిపార్ట్మెంట్ సహకారంతో చెరువులలో గంబూషియా చేపలు వదిలినట్లు తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి ఆహారం తీసికోవాలని, కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని తెలిపారు. అనారోగ్యం బారిన పడినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీప వైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

అసంపూర్తిగా సత్రం విచారణ

విశాలాంధ్ర-తాళ్లపూడి : మండల కేంద్రమైన తాళ్లపూడి లో పురాతన కాలం నాటి నుండి వాసవి కన్యక పరమేశ్వరి ఆర్యవైశ్య సత్రం పై వచ్చిన ఆరోపణలు పై విచారణ వివాదాస్పదంగా మారింది. ఈ విషయం లో జిల్లా కలెక్టర్ కు పి.జి.ఆర్.ఎస్ లో చేసిన పిర్యాదు మేరకు మండల తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, ఎంపీడీఓ వేణుగోపాల రెడ్డి, ఈఓపిఆర్డీ ఇంచార్జి వీరన్న లు ఓ సమావేశాన్ని నిర్వహించారు. సత్రం నిర్వాహకులు, ఆ సత్రంపై పిర్యాదు చేసిన వారితో రెండు వర్గాలతో అధిక సంఖ్య లో గ్రామస్తులు తాళ్లపూడి పంచాయతీ కార్యాలయానికి హాజరయ్యారు. ఇంతో ఒకరి పై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. అధికారులు ఎటు తేల్చకుండావెళ్లిపోయారు. గ్రామానికి చెందిన కుచిభట్ల ప్రసాద్ కలెక్టర్ కి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం ఆ సత్రం స్థలాన్ని కల్లూరి రామ భద్ర చైన్లు అనే దాత 100 సంవత్సరాల క్రితం కంకిపాటి శరభయ్య అనే వ్యక్తికి అప్పగించారు. బాట సారుల సత్రంగా నిర్వహించాలని కోరారు. నేడు ఆ స్థలాన్ని స్వంత స్థలంగా మార్చి స్వంత ఆస్తిగా చెప్పుకుంటూ, అధిక మొత్తంలో వసూలు చేస్తూ దాతల ఆలోచనకు విరుద్ధంగా నిర్వ హణ చేస్తున్నారని, ఉచిత రీతిన, దాత పేరుతో సత్రం నడపాలని, లేకుంటే గ్రామస్తుల పరం చేయాలని కోరారు. దీనిపై పంచాయతీ లో జరిగిన సమావేశం రస భసగా మారింది. నిర్వాహకులలో ఒకరైన కంకిపాటి బాబురావు ఆ సత్రం ను అభివృద్ధి చేస్తున్నామని, అది తమ హక్కని, పక్కాగా పత్రాలున్నాయని చెప్పారు. సమావేశంలో హాజరైన వారు మాత్రం దాత డాక్యుమెంట్ ప్రకారం ప్రజలకు ఉచితంగా వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. ఒక సమయం లో సమావేశం రసాభస గా మారి అసంపూర్తిగా ముగిసింది. తాళ్లపూడి తహసీల్దార్ లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ గ్రామస్థుల అంత కమిటీ గా ఏర్పడి సమస్య పరిష్కరించుకోవాలని తమకు సంబంధం లేని విషయమని పేర్కొంటూ తహశీల్దార్ సమావేశాన్ని ముగించి వెళ్లిపోయారు.

తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి బిహెచ్ఎస్ఆర్ అండ్ వి ఎల్ ఎం డిగ్రీ పీజీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు తెలుగు భాష పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి తెలుగు అధ్యాపకులు ఎస్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల కళాశాల ఏవో డాక్టర్ డి ఆనంద్ ప్రసాద్ ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్ తెలుగు అధ్యాపకులు ఎస్ వెంకటేష్ ఎం శ్రీనివాసులు తెలుగుప్రాముఖ్యత గురించి గిడుగు వెంకట రామమూర్తి గురించి విద్యార్థులకు వివరించారు, విద్యార్థులు మాతృభాష తెలుగు భాష పై పాడిన పాట ఎంతగానో ఆకట్టుకుంది ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంజె ప్రియాంక అధ్యాపకులు ఎం శ్రీనివాస్ సరళ రాము మహిధర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

భాష్యం స్కూల్‌లో...

దేవరపల్లి భాష్యం స్కూల్ నందు క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి పేరయ్య నాయుడు మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జన్మదినం పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని దేశభాష లందు తెలుగు భాష లెస్స అని కొనియాడబడిన భాష తెలుగు భాష అని ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని నికోలాస్ డి కాంటి అనే వెన్నిస్ యాత్రికునిచే కొనియాడబడిన భాష తెలుగు భాష అని తెలుగు భాష కమ్మదనాన్ని గుర్తించి విద్యార్థులంతా తెలుగు భాషనందు ప్రావీణ్యత సాధించాలని కోరారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం చాన్స్ ప్రిన్సిపాల్ షేక్ షబానా ఉపాధ్యాయులు మంజు శృతి సుధీశా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యపాఠశాలలో..

దేవరపల్లి స్థానిక శ్రీ చైతన్యపాఠశాలను శుక్రవారం మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీమతి వినూత్న గారు మాట్లాడుతూ మాతృభాషా అనేది మన కన్నతల్లి ఒడిలో నేర్చుకున్నటువంటి భాష కావున రేపటి పౌరులుగా ఉండే మీరు కన్నతల్లి లాంటి మాతృభాషను మరువకూడదని తెలిపి అందరికీ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పార్థసారథి కవిత రాజేశ్వరిష మీ కోఆర్డినేటర్ రామారావు మాతృభాష ఉపాధ్యాయులు విద్యార్థిలు పాల్గొన్నారు.

వసతి గృహాలు తనిఖీ

విశాలాంధ్ర - రాజోలు : మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వారి ఆదేశాల మేరకు శుక్రవారం రాజోలు కోర్టు ప్యానల్ లాయర్ జెహెచ్ సాగర్ రాజోలు ఎస్సీ బాలుర వసతి గృహం, సమీకృత బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. భోజనశాల, మంచినీటి సౌకర్యం, గదులు పరిశీలించారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు తాగేందుకు బోరునుండి వచ్చే కలుషిత నీరు ఇస్తున్నట్లు, అంతేకాక 50 మంది విద్యార్థులకు కేవలం మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అనంతరం బాలికల వసతి గృహంలో విద్యార్థునులకు న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేసి బాల్య వివాహాలు నిషేధ చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, ర్యాగింగ్, విద్యాహక్కు చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలికల హాస్టల్ వార్డెన్ జ్యోతి, పారాలీగల్ వాలంటీర్ కె సురేందర్, కోర్టు సిబ్బంది శ్రీనివాస్, మూర్తి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధవాహక సాంకేతికతలో జీజీయుకు అవకాశాలు

విశాలాంధ్ర - రాజానగరం : అర్ధవాహకం(సెమీ కండక్టర్) సాంకేతికతలో జీజియు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నామని న్యూఢిల్లీ టీఈసీసి(తైవాన్) సైన్స్, టెక్నాలజీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్.జి.యాంగ్ అన్నారు. మండలంలోని గోదావరిగ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజియు) నందు వర్సిటీ ఛాన్సలర్ కె.వి.వి. సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ఆధ్వర్యంలో, వర్సిటీ ఉపకులపతి డాక్టర్ యు. చంద్రశేఖర్ అధ్యక్షత హరిత ఆర్థిక వ్యవస్థ, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, కృత్రిమ మేధ ఆధారిత హరిత సాంకేతికతలు" అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ముగిసాయి. రెండో రోజు జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సెమీ కండక్టర్లు పై అందించిన శిక్షణతో పాటు ఆసక్తి కలిగిన విద్యార్థులకు తైవాన్‌లో ఉద్యోగ అవకాశాలు కూడా మెండుగా ఉన్నాయన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన నేషనల్ సన్ యాట్-సెన్ యూనివర్సిటీ (తైవాన్) ప్రొఫెసర్ సిహెచ్ చాంగ్ మాట్లాడుతూ గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయాన్ని మరోసారి తామ బృందంతో సందర్శించి, ఇరువురి మధ్య స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. భవిష్యత్తు ప్రణాళికలకు సంబంధించి నూతన అడుగు వేస్తామన్నారు. జీజియు విద్యార్థులు తైవాన్‌లో ఇంటర్న్‌షిప్‌లు చేసేందుకు మేము పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు.సభ అధ్యక్షులు, జీజియు ఉపకులపతి డాక్టర్ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ "ఇండో-తైవాన్ ప్రాజెక్టులపై విద్యార్థులు పనిచేసేందుకు జీజియు నుండి తైవాన్‌కు పంపించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు. అనంతరం సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీజియు ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కే.వి.బి.రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.ఎం.ఎం.ఎస్. శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, డీన్స్, డైరెక్టర్లు, కర్ణాటకలోని ప్రెసిడెన్సీ యూనివర్సిటీ ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్. శివా పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - సీతానగరం/రాజానగరం: రీ సర్వే, స్వామిత్వా సర్వేలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు అని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. శుక్రవారం కోరుకొండ ఎంపీడీవో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్వామిత్వ, రీ సర్వే పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే పనులు ఖచ్చితత్వం కలిసి చేపడుతున్నా ఇంకా సమస్యలు ఉత్పన్న మవుతున్నాయన్నారు. వ్యవస్థను స్థిరీకరించడానికి డిప్యూటీ ఎంపీడీవో (ఈవో పీఆర్డీ) నోడల్ అధికారి గానే కాకుండా అందరు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. పర్యవేక్షణాధికారులు తమ బాధ్యతలను ఖచ్చితంగా నిర్వర్తించాలని, కేవలం ఆదేశాలు ఇవ్వానని చెప్పడం సరిపోదన్నారు. అలాగే ప్రజలకు పౌర సేవలు అందించే క్రమంలో నిర్లిప్తత వహిస్తే ఊరుకోనని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా బాధ్యతల నిర్వహణలో ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. కోరుకొండ మండల పరిధిలో పేజ్ వారీగా తొలి దశలో రీసర్వే పూర్తి చేశామని, రెండు గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్ పనులు 100 శాతం పూర్తి చేశామని నివేదిక ఇచ్చినప్పటికీ, అన్ని గ్రామాలు పూర్తయ్యాయని చూపడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పి. వీణాదేవి, డిప్యూటీ ఎంపీడీవో బి. మహేష్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా పరిరక్షణకు భాగస్వామ్యం కావాలి : ప్రసన్నశ్రీ

విశాలాంధ్ర - రాజానగరం : తెలుగు భాషా పరిరక్షణకు ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలం లోని ఆదికవి నన్నయ వర్సిటీ నందు శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు.దీనిలో భాగంగా గిడుగు వెంకట రామమూర్తి పంతులు, ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు నన్నయ వీసీ ప్రసన్నశ్రీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ ఆధునిక తెలుగు భాషా కోసం శ్రమించిన వక్త, విద్యావేత్త గిడుగు గిడుగు వెంకట రామమూర్తి పంతులు వ్యవహారిక భాషాభివృద్ధికి చేసిన కృషిని ప్రశంసించారు. నేటి ఆధునిక కాలంలో సోషల్ మీడియా సాధనాలు, కొత్త పోకడలు భాషలోని ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. అమ్మభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, బాల్యం నుంచి భాషపై పట్టు సాధించాలని సూచించారు. గైట్ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లిమాధవి అధ్యక్షతన తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండల కేంద్రమైన రాజానగరంలోని దివ్య విద్యాసంస్థలు నందు విద్యాసంస్థల వైస్ చైర్మన్ బర్ల విజయ్ ఆధ్వర్యంలో 1వ తరగతి విద్యార్థులు చేసిన తెలుగు మానవ నమూనాను అందర్నీ ఆకట్టుకు న్నాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు మన మాతృభాషని దానిని మనం గౌరవించాలి అని అదేవిధంగా ఇతర భాషలను కూడా గౌరవించడం మన సంప్రదాయమని విద్యార్థులకు తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని మండల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఫుడ్ ప్రాసెసింగ్ అవగాహన సదస్సు స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు ఉపయోగకరంగా నిలిచింది. ముఖ్యంగా పూతరేకులు తయారు చేసే మహిళలు, అలాగే ఇతర ఆహార ఉత్పత్తులు తయారుచేసే మహిళలకు ఈ వర్క్‌షాప్ ఉపయుక్తంగా మారింది. సదస్సులో భాగంగా ఎల్రక్టానిక్ మిషన్ ద్వారా పూతరేకుల తయారీ విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన (డెమో) రూపంలో చూపించారు. ఆధునిక పద్ధతులను అనుసరించడం వల్ల మహిళలు తక్కువ శ్రమతో అధిక ఉత్పత్తి సాధించవచ్చని, మార్కెట్‌లో పోటీగా నిలవవచ్చని ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం డిఆర్డిఏ సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమానికి లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, ఎస్‌బిఐ ఆత్రేయపురం మేనేజర్ బొజ్జ ప్రవీణ్ కుమార్, ఫుడ్ ప్రాసెసింగ్ జోనల్ మేనేజర్ మారుతి, ర్యాలీ బ్యాంక్ మేనేజర్ వెంకట నరసింహ, ఫుడ్‌ప్రాసెసింగ్ డిఆర్పీలు ఈశ్వర్, రమ్య తదితరులు హాజరయ్యారు.మండల అభివృద్ధి అధికారి వివి రమణ, డిఆర్డిఏ ఏపీఎం గంగాధర్ పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

తాతారావుకు ప్రతిష్టాత్మకమైన భీమ్ రత్న అవార్డు

విశాలాంధ్ర - మామిడికుదురు : ప్రముఖ అంబేద్కరీయులు, సామాజిక వివాహాల సంధానకర్త జాలెం తాతారావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళిత చైతన్య వేదిక ప్రతిష్టాత్మకమైన భీమ్ రత్న అవార్డును ప్రదానం చేసింది. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామంలో మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు అధ్యక్షతన జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కలసి కరచాలనం చేసి, అంబేద్కర్ అంత్యక్రియల్లో పాల్గొన్న జాలెం తాతారావుకు దళిత చైతన్య వేదిక భీమ్ రత్న అవార్డు ప్రదానం చేయ్యడం సముచితమైన విషయమన్నారు. 500లకు పైగా సామాజిక వివాహాలు చేసి, బీవీ రమణయ్య ఉద్యమ బాటలో ముందుకు సాగిన జాలెం తాతారావు నేటి సమాజానికి ఆదర్శప్రాయుడన్నారు. అనంతరం నాయకులు హర్షధ్వానాలు చేస్తుండగా జై భీమ్ నినాదాలు హెూరెత్తుతుండగా దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, రాజోలు వైస్ ఎంపీపీ పొలుమూరి శ్యాంబాబులు భీమ్ రత్న అవార్డును జాలెం తాతారావుకు ప్రదానం చేశారు. మట్టా సురేష్ అవార్డు సత్కారా పత్రాన్ని చదువుతుండగా వేదిక సభ్యులైన చిలకపాటి శ్రీధర్, లిఖితపూడి బుజ్జి, మందపాటి మధు, బొడ్డపల్లి పుల్లయ్య, దీపాటి శివప్రసాద్ మెడబల శ్యాం శేఖర్, పొన్నమాటి భాస్కర్, కాకర విశ్వనాథం, ఉప్పే జగదీష్‌లు శాలువా, పులమలతో సత్కరించి తలపై నీలి కీర్తి కిరీటాన్ని అలంకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాలెం సుబ్బారావు, ఉమా పార్వతీ దంపతులు, జాలెం రాంబాబు, జాలెం భీమారావు, జాలెం సుస్మా, సర్పంచ్‌లు జాలెం రమణ కుమారి, గెద్దం వెంకటేశ్వరరావు, బళ్ళ శ్రీనివాస్, తాళ్ళ నాగరాజు, అడబాల తాతకాపు, ఎంపీటీసీల సమైక్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్ నాయకులు కలిగితి పళ్ళం రాజు, ముకరం హుస్సేన్, విప్పర్తి సాయిబాబు, నీతిపూడి చంద్రరావు, భూపతి వెంకటపతి, చింతా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై సూర్యఘర్ యోజన యూనిట్లు

విశాలాంధ్ర - సామర్లకోట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని అందిస్తున్నట్లు సూర్యగర్ యోజన కన్వీనర్ రవిచంద్ర తెలిపారు. ఈ పథకం ఉపయోగించుకున్న వారికి సబ్సిడీ వస్తుందని అదేవిధంగా బ్యాంకుల కూడా లోన్లు ఇస్తాయని తెలియజేశారు. శుక్రవారం సామర్లకోటలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన సూర్య ఘర్ యోజన పథకం పై అవగాహన శిబిరం నిర్వహించారు. త్రికేవీ విద్యుత్ పవర్‌తో ఈ పథకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్ కంటే జగదీష్ మోహన్ పాల్గొన్నారు.

సామర్లకోటలో ఎమ్మెల్యే గ్రీవెన్స్

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణ పరిధి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ చేపట్టినట్లు ఎమ్మెల్యే చినరాజప్ప తెలిపారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు కోరుతూ ప్రజలు దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జనరల్ ఫండ్ నిధులు దుర్వినియోగం : సుబ్బారావు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు నగర పంచాయతీలో జనరల్ ఫండ్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుబ్బారావు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ సాధారణ సమావేశంలో టేబుల్ అజెండాగా జనరల్ ఫండ్ నుంచి రూ.15 లక్షలు నిధులు పొందేందుకు ఆమోదం తెలిపారన్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే జనరల్ ఫండ్ నిధులు తీసుకోవాలని, వైసీపీ పాలకవర్గం నిధులు దుర్వినియోగం చేస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు

8న గుర్తింపు లేని రాజకీయ పార్టీలతో సమావేశం : కలెక్టర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి గుర్తింపు లేని రాజకీయ పార్టీల (RUPPs) సంప్రదింపు వివరాలు ఎన్నికల కమిషన్ ద్వారా నవీకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దిగువ పేర్కొన్న గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు సంబంధించి విచారణలు రాష్ట్ర ఎన్నికల కమిషనర్, వెలగపూడి, అమరావతి సమక్షంలో సెప్టెం బర్ 8న ర్వహించనున్నట్లు తెలిపారు. 8న ఉద యం 10:50 గంటలకు భరత్ ప్రజా స్పందన పార్టీ, 11:00 గంటలకు భారతీయ చైతన్య పార్టీ, 11:30 గంటలకు జై ఆంధ్రా పార్టీ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.

హాజరు కావలసిన పార్టీల వివరాలు...

భారతీయ చైతన్య పార్టీ రిజిస్టర్డ్ చిరునామా: డోర్ నెం. 9-186/7, హై స్కూల్ రోడ్, వెంకట్ నగర్, కడియం, తూర్పు గోదావరి జిల్లా - 533126. జై ఆంధ్రా పార్టీ రిజిస్టర్డ్ చిరునామా: D.No.14-71, Chagalnadu Steels, Morampudi Junction, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా - 533105. భరత్ ప్రజా స్పందన పార్టీ చిరునామా: డి.నెం. 2-42, కలవచర్ల గ్రామం, నిడదవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా (మునుపటి పశ్చిమ గోదావరి జిల్లా) - 534301. పూర్తి వివరాలతో హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.

1 'జాబ్‌మేళా'

విశాలాంధ్ర - కాకినాడ : 'విరాస' ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 సోమవారం 'వికాస' కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ''లో 'జాబ్‌మేళా' నిర్వహిస్తున్నారు. ఈజాబ్‌మేళాలో బజాజ్‌ఫైనాన్స్‌లో సేల్స్ ఆఫీసర్, మాక్సిషిల్డ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలి సేల్స్ రిప్రెజంటేటివ్, ఇసుజు, వియాష్ లైఫ్ సన్సెస్, జెకె ఫిన్నర్, డిక్సాన్, హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నిషియన్ ఫాక్స్‌కాన్ కంపెనీలో ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ సెప్టెంబర్ 01 సోమవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు 7799376222 డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. వికాసజాబ్స్.కం సంప్రదించవలెను.

భాష్యంలో తెలుగు భాష దినోత్సవం

విశాలాంధ్ర - కొత్తపేట : స్థానిక భాష్యం స్కూల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు అమ్మలాంటి కమ్మనైన తెలుగు భాష అందరికీ ఇష్టమైన భాష తెలుగు భాష తెలుగు ఎంతో వెలుగైన భాష అని ప్రిన్సిపల్ వై మణికంఠ అన్నారు. తెలుగు భాష దినోత్సవ సందర్భంగా తెలుగు విలువలను తెలియజేస్తూ అనేక పద్యాలు, శ్లోకాలు, వ్యాసరచన, వక్తృత్వా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపాల్ జె శ్రీనివాస్, చాంప్స్ ప్రిన్సిపల్ రమాజ్యోతి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర- కాట్రేనికోన : కాట్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో గురువారం తెలుగు భాషా దినో త్సవం, క్రీడా దినోత్సవాలను ప్రధానోపాధ్యా యురాలు ఆర్ అంబ ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా గిడుగు రామ్మూర్తి, జ్ఞాన్ చాంద్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే క్రీడా దినోత్సవం సందర్భంగా కిమ్స్ ఆధ్వర్యంలో స్కూల్ పీడీ మోరంపూడి సాయి నిర్వహించిన వివిధ ఆటల్లో గెలిపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రం, మెడల్‌ను హెచ్‌ఎం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, పేరిశెట్టి, కేశవరావు, పల్లారావు, శ్రీనుబాబు, యంయస్‌యన్ రాజు, శ్రీబాల, రాజేశ్వరి విద్యార్థులు పాల్గొన్నారు.

కళాసాహితిలో తెలుగు భాషా దినోత్సం

విశాలాంధ్ర - అమలాపురం : గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా, తెలుగు భాషా దినోత్సవం-2025 వేడుక స్థానిక తారా విద్యా సంస్థల ప్రాంగణం లో వైభవంగా జరిగింది. ముమ్మిడివరం కళాసాహితి, లలిత కళల సేవా వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రవీంద్ర విద్యా సంస్థల అధినేత శ్రీలక్ష్మీ శ్రీనివాసన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎలిపే మధు తెలుగు భాషా ఔన్నత్యం గూర్చి ప్రసంగించారు. తారా విద్యా సంస్థల అధిపతి సుమంత్ విద్యార్థులకు భాషా ప్రాధాన్యాన్ని వివరించారు. తెలుగు భాషా మాధుర్యం, నైతిక విలువలు అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిం చారు. జనిపెల్ల సత్యనారాయణ, ఆంగ్ల అధ్యాపకులు జెవిఎల్ నరసింహారావు, ప్రిన్సిపాల్ సత్తిబాబు, ఎన్ అబ్బులు మాష్టారు, విత్తనాల వరప్రసాదరావు, పి విజయకుమార్, ఎన్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ఉపాధి హామీ పథకం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెదపూడి : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంజిఎన్‌ఆర్‌జీఈఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక సభలో పాల్గొన్న ఎమ్మెల్యే గత ఏడాది ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పారదర్శకంగా ప్రజలకు చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి ఆదేశించారు. రైతులకు సంక్షేమ కల్పించడం కోసం ఉపాధి హామీలను ఆలంబన చేసుకుని కార్యక్రమాలు చేపట్టడం ముఖ్యంగా అనపర్తి నియోజకవర్గంలో అత్య అద్భుతంగా సాగిందని సరైన విధానంలో చేసుకోవడానికి ఉపాధి హామీ లబ్ధిదారులు సహకరించడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఎన్‌డిఏ నేతలు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలన

విశాలాంధ్ర - గండేపల్లి : తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద సృష్టించాలని డిప్యూటీ సీఈఓ రాంగోపాల్ అన్నారు. శుక్రవారం గండేపల్లి గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా మండల కేంద్రమైన గండేపల్లి గ్రామంలో పర్యటించి ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ వాహనాలు వారానికి ఎన్ని రోజులు వస్తున్నాయని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు ప్రతి ఒక్కరు తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ వాహనాల్లో వెయ్యాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం గండేపల్లిలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సంపద తయారీ విధానంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఉన్న సంపద కేంద్రాన్ని మెరుగుపరచాలన్నారు. అలాగే సంపద కేంద్రాల్లో ఎరువు తయారీ విధానంపై అధికారులు వివరాలు అడగడంతో వారికి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే చంద్ర రావు, కార్యదర్శులు ఫణీంద్ర కుమార్, పి వెంకటరమణ తదితరులు పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మోసం చేయడం బాబుకు అలవాటే : గిరిబాబు

విశాలాంధ్ర - శంఖవరం : ఉపన్యాసాలు ప్రచారాలతో ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పేర్కొన్నారు. శుక్రవారం అన్నవరంలో రాఘవేంద్ర రెసిడెన్సీలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ నరాల శ్రీను అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిబాబు మాట్లాడుతూ చంద్రబాబు పేరు చెబితేనే అందరికీ గుర్తు వచ్చేది వెన్నుపోటేనన్నారు. మై మాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అవి తీర్చకుండా ప్రతి ఇంటిని మోసం చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తేవాలని పిలుపునిచ్చారు. వైసిపి పార్టీని గ్రామాల్లో బలోపేతం చేసే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. వైసీపీ పార్టీకి ప్రజా ఆదరణ ఎక్కడ తగ్గలేదని వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలు మనసుల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం క్యూ ఆర్ కోడ్‌ను వైసీపీ నాయకులు ఆధ్వర్యంలో గిరిబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, జడ్పిటిసి ఈగల అప్పారావు, సరమర్ల మధుబాబు, అడపా సోమేష్, సకురు గుర్రాజు, దడాల సతీష్ బొట్టా చైతన్య, పాల్గొన్నారు.

వర్తక వ్యాపార పారిశ్రామికవేత్తలకు సెంట్రల్ బ్యాంక్ ప్రోత్సాహం

విశాలాంధ్ర - పిఠాపురం : వర్తక వ్యాపార, పారిశ్రామిక వేత్తలకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రోత్సాహం ఇస్తుందని డిప్యూటీ జనరల్ మేనేజర్ వై శ్యామలాదేవి తెలిపారు. పిఠాపురంలో ఉన్న ఎస్ కన్విన్స్ హాల్లో పిఠాపురం సెంట్రల్‌బ్యాంక్‌శాఖ కస్టమర్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా కార్పొరేట్ క్రెడిట్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వై శ్యామలాదేవి, రీజినల్ మేనేజర్ ఏవి రమణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేశారు. బడా పారిశ్రామి కవేత్తలను ఉద్దేశించి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్యామలాదేవి మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంకు 1911 సంవత్సరంలో స్థాపించడం జరిగిందని, దేశవ్యాప్తంగా 4,552 బ్రాంచ్‌లు ఉన్నాయని 65% బ్రాంచ్‌లన్ని రూరల్ ప్రాంతాల్లో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సాయి సుధా, బ్రాంచ్ సిబ్బంది, సునందని, గాయత్రి, బాబా పట్టణంలో ఉన్న పలువురు పారిశ్రామికవేత్తలుపాల్గొన్నారు..

గణేష్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి చేబ్రోలు గ్రామంలో వినాయక విగ్రహాలను సందర్శించారు. ఎటువంటి డీజే ప్రోగ్రామ్స్, బాణాసంచా లాంటివి పెట్టకూడదని సూచనలు చేశారు.

తెలుగు భాష పరిరక్షణకు పాటుపడదాం



విశాలాంధ్ర - కాకినాడ : తెలుగు భాష పరిరక్షణకై పాటుపడదాం అంటూ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మాతృ భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం కాకినాడ వివేకానంద పార్క్ మెయిన్ గేటు వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక నాయకుడు సిహెచ్. సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి ప్రభాకర వర్మ, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్తిరాజులు గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యావహారిక భాష కొరకు ఎనలేని కృషి చేసిన గిడుగు రామమూర్తి చిరస్మరణీయుడని కొనియాడారు. ఆయన ఉపాధ్యాయుడు ఏజెన్సీ ప్రాంతంలో పనిచేసిన కాలంలో సవర భాష కొరకు లిపిని తయారు చేసి విశేషమైన కృషి చేసారన్నారు. ఒక జాతి మనుగడకు భాష చాలా కీలకమన్నారు. ఇంగ్లీష్ మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం ఉండాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగు భాషలో వస్తేనే సామాన్యులకు అవగాహన కలుగుతుం దన్నారు. గుర్తింపు కలిగిన జాతీయ భాషలు అన్నింటికీ తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆవాజ్ కన్వీనర్ ఇబ్రహీం, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ వర్మలు గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం సరసన గిడుగు రామమూర్తి తెలుగు భాషా వైభవానికి ఎనలేని కీర్తి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి కె నాగజ్యోతి, ఎస్‌ఎఫ్ఐ నాయకులు జైరాం, సత్యం, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్. వెంకట రమణ, సిఐటియు నాయకులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, రాణి, రిటైర్డ్ ఎటిఓ బి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషా దినోత్సవం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ అండ్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో మాతృభాషా దినోత్సవ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష కోవిదుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటానికి విద్యార్థులు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన కవితల పోటీలలో విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. జాతీయ కవి సిహెచ్ సంసోన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సెక్రెటరీ నరసింహారావు, ప్రిన్సిపల్ కే మనోహర్, కరాటం ప్రవీణ్, యాలంగి వరప్రసాద్, చోడే జాన్ పాల్, వెంకట్, శ్రీనివాస్ కే శ్రావణ్, దిలీప్, డాక్టర్ కె హేమా విజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇస్త్రీ పెట్టె షాక్‌తో యువకుడు మృతి

విశాలాంధ్ర - కాట్రేనికోన : బట్టలు ఇస్త్రీ చేస్తుండగా విద్యుత్ ఘాతంతో యువకుడు మృతి చెందాడు. కొప్పిగుంట గ్రామానికి చెందిన కొప్పిశెట్టి శ్రీనివాసరావుకు కరెంటుఇస్త్రీ పెట్టె షాక్ కొట్టడంతో మరణించాడు. గురువారం సాయంత్రం డ్యూటీకి వెళ్లడానికి బట్టలు ఇస్త్రీ చేస్తుండగా షాక్ కొట్టిందని బంధువులు తెలిపారు. అవివాహితుడైన శ్రీనివాసరావుకు ఒక అక్క, చెల్లి, తల్లిదండ్రులు వున్నారు. కుటుంబ భారాన్ని మీద వేసుకునే కష్టపడే తత్వం ఉన్న ఒక్కగానొక్క కొడుకు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు బోరు మంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాదు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఇతను తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నాడు.

తెలుగు భాష, జాతీయ క్రీడ దినోత్సవాలు

విశాలాంధ్ర - సామర్లకోట : హాకీ క్రీడాకారులు ధ్యాన్ చంద్ సేవలు ఎనలేనివి స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ వై శివరామకృష్ణయ్య, విశిష్ట అతిథిగా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్‌లు పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అంద చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజల సమస్యల పరిష్కారం దిశగా కొప్పవరంలోని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో శుక్రవారం 19వ ప్రజాదర్బార్ నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయం ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో 19వ ప్రజా ధర్బార్ కార్యక్రమం జరిగింది. ఈ ప్రజా దర్బార్‌లో పింఛన్లు, విద్య, ఇళ్ల స్థలాలు, ఉపాధి, వైద్యం తదితర అంశాలకు సంబంధించి మొత్తం 30 అర్జీలు స్వీకరించగా, వాటిలో 5 అర్జీలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్, జున్నూరు బాబ్జి, డిఆర్‌యుసిసి సభ్యులు అనిల్, కాకరపల్లి చలపతిరావు, కరప మాజీ ఎంపీపీ సీతామాలక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

వాడి వేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర - మండపేట : గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను అడ్డం పెట్టుకుని మున్సిపల్ అధికారులు డ్రామాలు ఆడుతున్నారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులుగా తాము ఏదైనా పని కోసం మున్సిపల్ అధికారులతో మాట్లాడు తుంటే ఆ బాధ్యత సచివాలయ ఉద్యోగులదని తప్పించు కుంటున్నారని, అన్ని పనులు సచివాలయ ఉద్యోగులు చక్కబెడితే మున్సిపాలిటీలో మీకు ఉద్యోగాలు ఎందుకంటూ తీవ్రంగా మండి పడ్డారు. మున్సిపల్ ఉద్యోగులుగా మీకు పట్టణ అభివృద్ధి పైన సమస్యల పైనా పట్టించుకునే బాధ్యత ఉందా లేదా అని ప్రశ్నించారు. అలాంటప్పుడు మీకు ప్రభుత్వం జీతాలు ఇవ్వడం దండగే కదా అంటూ అధికారుల తీరుపై తీవ్రంగా మండి పడ్డారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే వేగుళ్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్ హాలులో వాడి వేడిగా పలు అంశాలపై చర్చ జరిగింది. సాధారణ సమావేశం అజెండాలో పొందుపరిచిన 13 అంశాలకు గాను ఏడవ అంశం వచ్చేసరికి వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు అనేక ప్రశ్నలు లేవనెత్తారు. 2019-20 మధ్యకాలంలో పట్టణంలో మున్సిపాలిటీకి సంబంధించిన అనేక భవనాలు నిర్మాణం కోసం డీటెయిల్ అంచనాలు స్ట్రక్చరల్ డిజైన్లు ప్లాన్లు తయారు చేసినందుకుగాను విజయవాడకు చెందిన చిందా ఇంజనీరింగ్ సంస్థకు రూ.3,60,000 బిల్లు చెల్లించే అంశాన్ని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. అయితే ఆ భవనాలు అన్నీ బేస్ మెంట్ లెవెల్‌లోనే నిలిచిపోయాయని, పైగా గత ప్రభుత్వంలో స్కూల్ బిల్డింగులు అన్నీ నాడు నేడు పథకంలోకి వెళ్ళాయని గణేశ్వరరావు గుర్తు చేశారు. ఆ పథకం ద్వారా నిర్మాణానికి సంబంధించిన అధికారాలన్నీ ఆయా ప్రధానోపాధ్యాయులకు అప్పగించారని అన్నారు. అటువంటప్పుడు ఆ బిల్లులు పురపాలక సంఘం ఎందుకు భరించాలని ఆయన ప్రశ్నించారు. ఎప్పుడో ఐదేళ్ల క్రితం తెలియపరచాల్సిన అంశాన్ని తాజాగా ఇప్పుడు కౌన్సిల్ దృష్టికి తేవడం ఏమిటని ఆయన నిలదీశారు. దీన్ని కౌన్సిల్ వ్యతిరేకిస్తోందని చెప్పడంతో సభ్యుల అంగీకారంతో ఆ అంశాన్ని పక్కన పెట్టారు. వాటర్ వర్క్స్‌కు సంబంధించిన స్థలంపై సుదీర్ఘ చర్చ నడిచింది. మున్సిపల్ ఆస్తులు అన్యాక్రాంతం అయిపోతుంటే చూస్తూ ఊరుకుంటారా అంటూ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ కౌన్సిల్లో ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్మన్ దివంగత సర్దార్ వేగుళ్ళ వీర్రాజు హయంలో వాటర్ వర్క్స్‌కు సంబంధించిన భూమిని ప్రైవేటు వ్యక్తుల వద్ద నుంచి కొనుగోలు చేసి పురపాలక సంఘానికి ఆస్తులు కూడబెట్టారని ఆయన గుర్తు చేశారు. కోట్లు విలువైన ఆ భూమిని పరిరక్షించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులదేనని హితవు పలికారు. ఈ అంశంపై ఎమ్మెల్యే వేగుళ్ల జోక్యం చేసుకొని గతంలో జరిపిన సర్వే వివరాలు బయట పెట్టాలని కోరారు. దీనిపై కమిషన్ టీవీ రంగారావు మాట్లాడుతూ అందులో ఒకవైపు సరిహద్దు గల యజమాని కోర్టుకు వెళ్ళిన విషయాన్ని తెలియ పరిచారు. దాని మాట పక్కన పెడితే ఇప్పుడున్న భూమికి కొలతలు సక్రమంగా ఉన్నాయా లేదో చెప్పాలని కమిషనర్‌ను నిలదీశారు. సర్వే విషయంపై తహసీల్దార్ కార్యాలయం నుంచి రిప్లై రావాలని ఆయన సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ళ తహసీల్దార్ తేజేశ్వరరావుకు కాల్ చేసి సభ్యులకు వినిపించారు. ఆయన సర్వేకు సంబంధించిన విషయాలు జాప్యానికి గల కారణాలను ఫోన్లో వివరించారు. ఎమ్మార్వో చెప్పిన దానికి సమాధానం ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. ఆయన చెప్పిన విషయాలన్నీ తనకూ తెలుసని హై కోర్టు ద్వారా వచ్చిన నోటీసులు ఆయనకూ అందాయని అయితే మొదటి దశలో జరిగిన సంఘటన వివరాలు చెబుతున్నారే గానీ రెండవ దశలో హై కోర్టు నుంచి నోటీసులు వచ్చిన విషయాన్ని తహసీల్దార్ చెప్పడం లేదంటూ ఆయన చిన్న స్వరంతో అన్నారు. పని చేసే విషయంలో మండపేట తహసీల్దా రుకు పేరు పెట్టడానికి ఎవరూ సరిపోరని ఎమ్మెల్యే వేగుళ్ళ కితాబులు ఇచ్చారు. ఈ సమావేశం పూర్తయిన అనంతరం తహసీల్దార్, మున్సిపల్ అధికారులు చైర్ పర్సన్ దుర్గారాణి ఆధ్వర్యంలో సమీక్ష జరిపి వాటర్ వర్క్స్ సర్వే ముందుకు నడిపించాలని సూచించారు. భూముల సర్వేలకు సంబంధించి తాను ఇప్పటికే చాలా కోల్పోయానని రాజబాబు అన్నారు. తన ఆస్తికి సంబంధించి ఓ సర్వే విషయమై మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా నేటికీ అతీగతీ లేదని ఆయన పెదవి విరిచారు. కనీసం మున్సిపల్ ఆస్తులను కాపాడడం లోనైన అధికారులు శ్రద్ధ వహిస్తే బాగుంటుందని ఆయన హితవు పలికారు. ఈ దశలో అసలు పురపాలక సంఘంలో సర్వే సెక్రటరీలు ఎంతమంది ఉన్నారని ఎమ్మెల్యే వేగుళ్ళ కమిషనర్‌ను ప్రశ్నించారు. మొత్తం 12 మంది సర్వే సెక్రటరీలు ఉన్నారని కమిషనర్ జవాబు ఇవ్వగా, వారంతా ఏమి చేస్తున్నట్టు అని ఎమ్మెల్యే నిలదీశారు. మున్సిపల్ షాపుల అద్దె బకాయిల అంశం వచ్చేసరికి ఎమ్మెల్యే వేగుళ్ళ అసహనం వ్యక్తం చేశారు. డ్రైయిన్లు శుభ్రం చేయడానికి ఎవరూ రావడం లేదని మహిళలు చెప్పగా కాలనీకి ప్రత్యేకంగా కార్మికులను ఏర్పాటు చేసి శుభ్రం చేయిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అదేవిధంగా వివిధ అంశాలపై కౌన్సిల్‌లో చర్చించారు.

సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు-2025

సెప్టెంబర్ 21 నుంచి 28 వరకు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం సిటీ : బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్(ఏబిఎపిఏ), సంయుక్త ఆధ్వర్యంలో యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2025ను సెప్టెంబర్ 21 నుండి 28 వరకు రాజమండ్రిలోని సిటీ బ్యాడ్మింటన్ కోర్టులు, బొప్పన స్పోర్ట్స్ క్లబ్లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. శుక్రవారం సిటీ బ్యాడ్మింటన్ కోర్టు లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అతిపెద్ద సీనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్ రాజమండ్రిలో నిర్వహించడం ఇదే మొదటిసారి అది కూడా మన రాజమండ్రిలో రెండు వేదికలలో నిర్వహించడం గర్వించే విషయమని అన్నారు. ఇది భారతదేశంలో అతిపెద్ద ర్యాంకింగ్ టోర్నమెంట్, ఈ టోర్నమెంట్ లో దేశవ్యాప్తంగా దాదాపు 1500 మంది ఆటగాళ్ళు పాల్గొననున్నారని ఆయన తెలిపారు. భారతదేశంలోని అగ్రశ్రేణి ఆటగాళ్ళు కూడా ఈ టోర్నమెంట్లో పాల్గొంటారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. గత ఏడాది మన రాజమండ్రిలో 78వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ -2024 పోటీలను విజయవంతంగా నిర్వహించామని, మళ్లీ ఇప్పుడు సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2025ను నిర్వహించేందుకు రాజమండ్రి ముస్తాబవుతోందని ఆయన సంతోషం వ్యక్తంచేశారు. గతంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్షిప్లో ఐదు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పోటీలలో పాల్గొనడానికి వచ్చారని వాళ్ళందరికీ అద్భుతమైన ఆతిథ్యం అందించామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, ఎంపీ పురందేశ్వరి, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారని, ఈసారి జరిగే పోటీకూడా అంతకంటే ఘనంగా, భవిష్యత్తులో ఈ పోటీలు ఎవరు నిర్వహించాలని చూసినా రాజమండ్రి ఒక రోల్ మోడల్ గా వాళ్లకు నిలిచేలా విజయవంతంగా నిర్వహిస్తామని ఆయన చెప్పారు. "ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, ఇతర ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ ,తదితరులు పాల్గొనున్నారని, క్రీడాకారులు, క్రీడా అభిమానులు అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని దీనిని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కోరారు.ఎన్నికల సమయంలో రాజమండ్రిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చానని దానికి అనుగుణంగానే అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని ఆయన వివరించారు. విద్యార్థులకు చదువుతో పాటు మానసిక, శారీరక ధారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని, ఆశదిశగా రాజమండ్రి సిటీలోని ప్రైవేటు, ప్రభుత్వ విద్యా విద్యార్థులకు క్రీడలు నిర్వహించేలా కృషి చేస్తామని ఆయన చెప్పారు. మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు శుభాకాంక్షలు తెలిపారు. రాజమండ్రిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ లో అవకాశం కల్పించాలని చాలా మంది వచ్చి తనను అడుగుతున్నారని ఆయన చెప్పారు. మోరంపూడి శ్రీ చైతన్య విద్యాసంస్థలో రజక విద్యార్థిపై ఇస్త్రీ పెట్టెతో దాడి చేసిన కేసులో ఇద్దరు విద్యార్థులను జువైనల్ జైలుకు పంపించారని, పీఈటీపై కూడా చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. అనంతరం తదితర అంశాలపై మాట్లాడారు.జిల్లా బ్యాడ్మింటన్ప్రధాన కార్యదర్శి అసోసియేషన్ కొత్తపల్లి బాలు మాట్లాడుతూ రాజమండ్రిలో ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించడంవల్ల 1500 మంది అగ్రశ్రేణి క్రీడాకారులు హాజరవుతారని, వారంతా నగరంలోని వివిధ హెటళ్ళలో బస చేయడంవల్ల వారం రోజుల పాటు హెటళ్ళు రద్దీగా ఉండి వాటికి ఆదాయం లభిస్తుందని అన్నారు. నేషనల్ టోర్నమెంట్ నిర్వహించడానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రోత్సాహం కారణమని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మద్దూరి శంకర్, కోశాధికారి బెజవాడ వెంకట్, ఏపీబిఏ ఉపాధ్యక్షులు చిట్టూరి రాంబాబు, ఈసీ సభ్యులు ఇన్నమూరి దీపు, ఆకుల రాంబాబు, కర్రి నాగేశ్వరరావు, బొప్పన స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రతినిధి బొప్పన కృష్ణ చైతన్య, సిబిసి ఎం డబ్ల్యు ఏ అధ్యక్షుడు సిహెచ్ గంగరాజు, నాయకులు కాశీ నవీన్ కుమార్, బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.

చైర్ పర్సన్ దుర్గారాణి గణనాథుడికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మండపేట : గణపతి నవరాత్రులు సంద ర్భంగా పురపాలక సంఘం కార్యాల యంలో శ్రీ వరసిద్ధి వినాయకుడిని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శుక్రవారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గణపతి దేవుని ఆశీస్సులతో పట్టణ అభివృద్ధి మరింత వేగం పొందాలని ఆకాంక్షించారు. పట్టణ ప్రజలందరిపై వరసిద్ధి వినాయకుడు వరాలు కురిపించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.

విద్యుత్ భద్రతపై జాగ్రత్తలు తప్పనిసరి

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బం దికి ఆదేశాలు జారీ చేసినట్లు ఏలూరు సర్కిల్ ఎస్ఈ పి సాల్మన్ రాజు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదేశాల మేరకు ప్రజలకు, భక్తులకు, మండప నిర్వాహకులకు విద్యుత్ భద్రతా సూచనలు అందజేస్తున్నామని ఎస్ఈ చెప్పారు. మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం అధికారిక కనెక్షన్లు మాత్రమే తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో హెల్ప్ లైన్ నంబర్ 1912 కి సంప్రదించవచ్చని ఎస్ఈ సాల్మన్ రాజు చెప్పారు.

రాగసుధకు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

విశాలాంధ్ర -ముసునూరు : మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని బొప్పూడి రాగసుధ డీఎస్సీ 2025లో మొదటి ప్రయత్నంలోనే ఒకే దఫాలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో ఆమె పలువురి ప్రశంసలు అందుకున్నారు. గ్రామానికి చెందిన వ్యవసాయకూలీ బొప్పూడి నాగేశ్వరరావు పెద్ద కుమార్తె రాగసుధ స్కూల్ అసిస్టెంట్ హిందీలో 82.28 మార్కులు సాధించి 5వ ర్యాంకు, పి.జి.టీలో 78.5 మార్కులతో 6వ ర్యాంకు, టి. జి. టి 82.28 మార్కులతో తొమ్మిదవ ర్యాంకు సాధించింది. ఆమె ఈ ఫలితాల విజయం వెనుక తల్లిదండ్రుల కృషితో పాటు, వివాహానంతరం ఆమె భర్త సహకారం ఎంతో ఉందని రాగ సుధా తెలిపారు. తనది మధ్యతరగతి కుటుంబం ఇంటర్మీడియట్ తర్వాత దూర విద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశాను అన్నారు. ఆమెకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నప్పటికీ ప్రతిరోజూ 14 గంటలు చదువుకునేలా భర్త రవి, కుటుంబ సభ్యుల సహకారం తోడ్పడిందని, చదువుకు పేదరికం అడ్డం కాదని దృఢ సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు అని రాగ సుధా అన్నారు ఈ సందర్భంగా ఆమెను గ్రామ పెద్దలతో పాటు మండలంలోని పలువురు ప్రముఖులు అభినందించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మహిళా సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. ప్రత్తిపాడు ట్రెజరీ కార్యాలయం నుంచి స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి ఎమ్మెల్యే బస్సులో ప్రత్తిపాడు నుంచి అన్నవరం వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ తమ ప్రభుత్వం స్త్రీ శక్తి పథకంతో ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని మహిళలు పూర్తిస్థాయిలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ ప్రభుత్వంలో మహిళలకు అన్ని రంగాల్లోనూ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎవిఆర్ కుమార్ బాబు, ఏపీఎమ్ జి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, కూటమి నాయకులు యాళ్ళ జగదీష్, కొమ్ముల కన్నబాబు, అంబటి బుజ్జి, వెలుగుల నాని, ఇళ్ల అప్పారావు, గోవిందనాయుడు, పాల్గొన్నారు.